




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 31-5-2025

సంపుటి: 21 సంచిక: 58

పేజీలు: 8 వెల: రూ.1




## హెడ్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన

# ఇద్దరికి 20 రోజులు శిక్ష

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

హెడ్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులకు శ్రీకాకుళం సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ 20 రోజులు శిక్ష విధించినట్లు శ్రీకాకుళం టౌన్ సిఐ పి.పైడపునాయుడు తెలిపారు. మంగువారితోటలో నివాసం ఉంటున్న పొన్నాడ త్రినాథ రావు హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ (ప్రస్తుతం శ్రీకాకుళం డీసీఆర్‌బీలో పనిచేస్తున్నట్లు) ఈ నెల 29న రాత్రి ఇంటికి తన మోటార్ సైకిల్‌పై వెళుతున్నారు. రాత్రి సుమారు 7.20 గంటల సమయంలో లెప్రసీ కాలనీ జంక్షన్ వద్ద బోడెమ్మ కోవెల వీధికి చెందిన వెల్లంపూడి రాజేష్, దమ్మల వీధికి చెందిన పొట్నూరు వాసు కలిసి బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తూ, దారిని పోయేవారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా అది గమనించిన హెడ్‌కానిస్టేబుల్ త్రినాధరావు వారు చేస్తున్న పని తప్పని ప్రశ్నించగా, మద్యం మత్తులో ఉన్న ఇరువురు అతనిపై దాడి చేశారు. సమాచారం తెలుసుకున్న శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్‌ఐ బి.రామారావు తక్షణమే సంఘటన స్థలానికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ బ్రీత్‌ఎనలైజర్ ద్వారా పరీక్షించగా ఇరువురు మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో వారిద్దరిని శ్రీకాకుళం సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ శివరామకృష్ణ ఒక్కొక్కరికి 20 రోజుల చొప్పున శిక్ష విధించగా, వారి ఇద్దరినీ జిల్లా జైలుకు తరలించారు.

## వామనుడు టు త్రివిక్రముడు

# వి'స్వరూప్'ం

- వైకాపా రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడిగా మెంటాడ
- జగన్ కోర్‌కమిటీలో స్థానం
- పార్టీ అధినేతే ఏరికోరి చేర్చిన పేరు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇంతింతై వటుడింతయై మరియు దానింతై నభోవీథిపై
నంతై తోయద మండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయై ధ్రువుని పైనంతై మహర్వాటిపై
నంతై సత్య పదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై

.. ఈ పద్యం ఏదో ఒక సందర్భంలో వినని వారుండరనుకుంటాను. ఒక సామాన్యుడిగా బతుకు ప్రారంభించి, అంచె లంచలుగా ఎదిగి ఉన్నత శిఖరాలకు చేరుకున్న వ్యక్తిని గురించో, అలాగే సన్నగా ప్రారంభమై క్రమక్రమాభివృద్ధి పొంది మిన్నగా రూపొందిన దాన్ని గురించో చెప్పేటప్పుడు 'ఇంతింతై వటుడింతయై అన్నట్టు ఎదిగిపోయాడు' అని చెప్పుకోవటం పరిపాటి. అంతగా ప్రజల నాలుకల మీద కనీసం మొదటి లైను అయినా నిలిచిపోయింది ఈ పద్యం.

ఎక్కడ శ్రీకాకుళం జిల్లా.. ఎక్కడ వైకాపా రాష్ట్ర యువజన విభాగం? ఇంతవరకు అధికారంలో ఉన్న పార్టీల్లో మంత్రులుగానో, అంతకు మించో ఇక్కడ సీనియర్ రాజకీయ నేతలు పనిచేసుండొచ్చు. కానీ, పార్టీ అనుబంధ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎదగడమంటే చిన్నవిషయం కాదు. అందులోనూ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధినేత నమ్మి.. ఒకరి భుజస్కందాల మీద ఓ పెద్ద బాధ్యతను

- మిగతా చివరి పేజీలో

## గ్రామ సర్వేయర్లకు

# గ్రహణం!




- రేషనలైజేషన్ తీరుపై వీఆర్వోల అసంతృప్తి
- ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు తీరుపై ఆగ్రహం
- తమను సర్వే ఏడీ పరిధిలో చేర్చాలని విజ్ఞప్తి
- త్వరలో సగానికి సగం తగ్గిపోనున్న సచివాలయాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సచివాలయ వ్యవస్థ ప్రక్షాళనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో గ్రామ సర్వేయర్ల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ, వార్డు సచివాలయాల్లో చేపట్టిన సిబ్బంది రేషనలైజేషన్‌కు విలేజ్ సర్వేయర్స్ అసోసియేషన్ సముఖంగానే ఉన్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుబాబు ప్రకటించారు. అయితే తమను సంప్రదించకుండానే రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు ప్రభుత్వ పెద్దలను కలిసి గ్రామ రెవెన్యూ అధికారి(వీఆర్వో), గ్రామ సర్వేయర్లను రేషనలైజేషన్‌లో ఇతర శాఖలకు పంపకుండా తహసీల్దార్ల ఆధీనంలో పనిచేసేలా

- మిగతా చివరి పేజీలో

## హింసించి సాధించిన సాక్ష్యాలు, అరెస్టులు

# కోర్టుల్లో నిలబడతాయా?

మాడభూషి శ్రీధర్

ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా పోలీసులు న్యాయంగా సాక్ష్యాలు సేకరిస్తే న్యాయస్థానంలో నిజాలు రుజువయ్యే అవకాశం ఉంటుంది. హింసిస్తేనే నిందితులు నిజాలు చెప్పడం సాధ్యమని పోలీసులు అంటారనే విషయం చాలామందికి తెలుసు. అయినా హింసిస్తే.. భరించలేక నేరాన్ని ఒప్పుకుంటారా? లేకపోతే నేరం నిజమే కాబట్టి అవునవును అంటారా? ఏదేమైనా నేరం ఒప్పుకుంటే కోర్టుకు పోయేదాకా బతికిపోవచ్చు అనుకుంటారేమో.

పోలీసులు హింసించినపుడు నిందితులు వెల్లడించిన అంశాలను కోర్టులో చూపినప్పుడు ఆ నిందితుడు ఇదంతా హింసించడం వల్ల రాసిందే అన్నాడంటే మాత్రం కేసు నిలబడదు. అప్పటి నుంచి కోర్టు తగాదా మొదలువుతుంది. పైకోర్టుకు ఆ పైకి ఈ తగాదా వెళ్తూ ఉంటుంది. నిజానిజాలు లావుపాటి లా పాఠాలలో చదవి విప్పరు..

మరో తగాదా కూడా ఉంది. చాలామంది కలిసి నేరం చేస్తే దర్యాప్తులో ఒకరు నేరాన్ని ఒప్పుకున్నపుడు సమస్య మరింత జటిలమవుతుంది. అనుమానితుడి మీద విడిగా థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తే, ఆ తర్వాత మరో అనుమానితుడిని పట్టుకుని ఇదే డిగ్రీ ప్రయోగిస్తే తను నేరం చేసినట్లు ఒప్పుకునే అవకాశం ఉంది. చాలా సందర్భాల్లో అదే జరుగుతూ ఉంటుంది. ప్రధాన నిందితుడి ఆరోపణల ఆధారంగా సహ నేరస్తుడికి నిందితుడిగా హోదా ఇచ్చి, అరెస్టు చేసి జైలుకు పంపడం న్యాయమా అన్న ప్రశ్న ఆంధ్రప్రదేశ్ పోలీసు





ల కేసులో సుప్రీంకోర్టు దాకా వచ్చింది. నేర విచారణలో ఒక నిందితుడు తనతో పాటు మరొక వ్యక్తి కూడా నేరాలు చేశాడని అంటే అతను సహనిందితుడు అవుతాడు. మొదటి నిందితుడు జైలుకు పంపడానికి మరో సహ నిందితుడి నుంచి పోలీసులు చెప్పించుకున్న నేరాంగీకారం వాడుకుని మొదటి వాడిని, తర్వాత రెండోవాడిని కూడా జైలుకు పంపిస్తారు. ఆ నేరాంగీకార వాంగ్మూలానికి అంటే అనుమానితుడి స్టేట్‌మెంట్ సిఆర్‌పిసి సెక్షన్ 161 కింద (ఇది పాత కేసు, పాత నేరం కావడం వల్ల

- మిగతా లోపలి పేజీలో











## గుండెపోటుతో సచివాలయ ఉద్యోగి మృతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధిలోని సానా వీధి వార్డు సచివాలయం ఎమినిటీస్ సెక్రటరీ పల్లి దాలినాయుడు(29) శనివారం ఉదయం పెన్షన్ పంపిణీ చేయడానికి ఐదున్నర గంటల ప్రాంతంలో బయలుదేరుతుండగా, గుండెపోటు వచ్చి హఠాత్తుగా మరణించాడు. దాలినాయుడు స్వస్థలం జలుమూరు మండలం చల్లపేట. అతడి భార్య మాధురి పాలకొండలో సచివాలయ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఆయనకు ఏడాదిన్నర బాబు ఉన్నాడు. కుటుంబంతో కలిసి స్థానిక ఇందిరానగర్ కాలనీలో దాలినాయుడు నివాసముంటున్నాడు. దాలినాయుడు హఠాన్మరణంతో తల్లి, భార్య కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సహచర ఉద్యోగులు తట్టుకోలేని ఈ బాధలోనే అరగంట సేపు అక్కడ ఉండి, మళ్లీ వెంటనే వెళ్లి పింఛన్లను పంపిణీ చేయడం విశేషం.

• ఎడిటోరియల్

# విద్యా వ్యవస్థలు మారితేనే అవస్థలు తీరు!

విదేశీ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి కేంద్రం అనుమతించింది. జాతీయ విద్యా విధానం-2020(ఎన్‌ఈపీ) సిఫార్సుల ఆధారంగా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఉన్నత విద్య ప్రపంచీకరణ వైపు వేసిన తొలి అడుగుగా చెప్పవచ్చు. అదే సమయంలో భారతీయ విద్యాసంస్థలు విదేశీ విద్యాసంస్థలతో పోటీ పడేందుకు ద్వారాలు తెరుస్తుందని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కానీ ఈ మార్గంలో అనేక సవాళ్లు, తీవ్ర అడ్డంకులు ఉన్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. వీటిని పరిష్కరించకుండా అంతర్జాతీయంగా పోటీ పడటం మన ఉన్నత విద్యా సంస్థలకు కత్తి మీద సాములా మారుతుంది. ఆరోగ్యకరమైన పోటీ వాతావరణం, మెరుగైన అవకాశాలు, మానవ వనరుల సక్రమ నిర్వహణ వంటి లోపాలను అధిగమించకుండా పోటీ పడితే.. పరిస్థితి మరింత దిగజారవచ్చు. దేశంలో మెజారిటీ ఉన్నత విద్యాసంస్థలు తమకు మంజూరైన స్టాఫ్ ప్యాటర్న్‌లో 40 నుంచి 50 శాతం సిబ్బందితోనే నెట్టుకొస్తున్నాయి. మరోవైపు ప్రతిభ, వృత్తి నైపుణ్యాలు పుష్కలంగా ఉన్న అధ్యాపకులు, ఇతర ఉన్నతోద్యోగులు భారతీయ సంస్థలను వీడి అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు, కార్పొరేట్ విద్య, ఇతర సంస్థల్లో చేరిపోతున్నారు. విద్యాసంస్థల మనుగడకు అధ్యాపకవర్గమే అత్యంత కీలకం. కానీ మన ఉన్నత విద్యాసంస్థలకు ఉన్న అనేక పరిమితుల కారణంగా నాణ్యమైన అధ్యాపకులను నియమించడం సవాలుగా మారుతోంది. పరిమిత నిధులు, లోపభూయిష్టమైన ఎంపిక ప్రక్రియ వంటివి ప్రధాన అవరోధాలుగా ఉన్నాయి. ఉన్నత విద్యాసంస్థల్లో నియామక ప్రక్రియ కేంద్రీకృతమై ఉండటం, ఎంపిక ప్రక్రియ సరళంగా లేకపోవడం వల్ల నియామకాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీనివల్ల ప్రతిభావంతులైన అభ్యర్థులు వేరే సంస్థల్లో చేరిపోతున్నారు. ప్రభుత్వ నిధులు, మార్గదర్శకాలతో నడిచే ఉన్నత విద్యాసంస్థల్లో ప్రతి చిన్న అంశాన్ని ఆ ప్రమాణాల చట్రంలోనే చూస్తారు. దీనివల్ల చాలా సందర్భాల్లో వృత్తి నిపుణులను, ప్రతిభావంతులైన అధ్యాపకులను కాపాడుకోవడం కష్టసాధ్యమవుతోంది. ఇటువంటి వారికి ఇచ్చే ప్యాకేజీలు, ప్రోత్సాహకాలు ఆకట్టుకునేలా ఉండాలన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించడం లేదు. మన విద్యాసంస్థల్లో తరచూ ఉద్యోగ ఖాళీలు పెరిగిపోతుండటం సాధారణం. ఆయా వ్యవస్థలు అనుసరిస్తున్న నియామక విధానాలే దీనికి కారణం. విదేశీ సంస్థల్లో రిటైర్‌మెంట్లు, ఇతర కారణాల వల్ల ఉద్యోగులు, అధ్యాపకుల పోస్టులు ఖాళీ అవుతున్నాయంటే చాలు.. ఆ ఖాళీలు ఏర్పడకముందే ఆ స్థానాలకు కొత్తవారిని నియమించి రెడీగా ఉంచుతారు. కానీ మనదేశంలోని విద్యాసంస్థల్లో ఖాళీలు ఏర్పడిన తర్వాతే నియామక ప్రక్రియ మొదలవుతుంది. కొత్తగా వచ్చిన వారికి ఇంతవరకు ఆ పోస్టులో ఉన్నవారు ఏం చేశారు, దాని కొనసాగింపుగా ఏం చేయాలన్నది తెలియదు. వాటిని అర్థం చేసుకోవడానికే చాలా సమయం పడుతుంది. ఇది విద్యాప్రగతిని కుంటుపరుస్తుంది. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి వీలుగా విద్యాసంస్థల్లో మానవ వనరుల నిర్వహణ పద్ధతులను సమూలంగా మార్చాల్సిన అవసరం ఉంది. ఉన్నత విద్యా వ్యవస్థను మార్చడానికి ఎన్‌ఈపీ-2020 ఒక కీలకమైన బ్లూప్రింట్. ఇది పద్ధతులను మార్చడానికి, సమర్థులైన అధ్యాపకులు, సిబ్బందిని ప్రేరేపించడానికి మరియు శక్తివంతం చేయడానికి ప్రోత్సాహక పథకాలను అన్వేషించడానికి అనేక సిఫార్సులను అందిస్తుంది. నూతన జాతీయ విద్యా విధానం ఈ లోపాలను చాలా వరకు గుర్తించింది. వాటిని అధిగమించడానికి తగిన పరిహారాలను, ప్రత్యామ్నాయాలను కూడా సూచించింది. ఎంపిక ప్రమాణాలను మెరుగుపరిచి ఫాస్ట్ ట్రాక్ విధానాన్ని సూచించింది. బోధన, పరిశోధన సిబ్బంది నియామకాల్లో అధ్యాపక ప్రతినిధులు నిర్ణయాత్మక పాత్ర పోషించాలని సూచించింది. ఉద్యోగులను, ముఖ్యంగా అధ్యాపక బృందాన్ని నిలుపుకోవడంలో పని వాతావరణం కీలక పాత్ర పోషిస్తుంది. వారికి వృత్తిపరమైన స్వేచ్ఛ కల్పించడం చాలా కీలకం. ఈ వ్యవస్థ మేధో జ్ఞానాన్ని కాపాడుకోవడానికి మాత్రమే కాకుండా సరైన ఉద్యోగానికి సరైన వ్యక్తిని నియమించడంలో కూడా సహాయపడుతుంది. ప్రమోషన్, కెరీర్ పురోగతి, వార్షిక ఇంక్రిమెంట్లు, శిక్షణ సదరు ఉద్యోగి పనితీరుకు కచ్చితంగా ముడిపడి ఉండాలి. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల జాబితాలో చోటు సంపాదించడానికి, మన విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో నిలపడానికి జాతీయ విద్యా విధానం సిఫార్సులను కచ్చితంగా అమలు చేసి మన విద్యాసంస్థలను మరింత ప్రొఫెషనల్‌గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

## మాతృభాషతోపాటు ఆంగ్ల భాష కూడా ముఖ్యమే

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతి విద్యార్థి తాము ఎంచుకున్న లక్ష్యసాధన కోసం ప్రణాళికగా ముందుకు సాగాలంటే ఇలాంటి శిక్షణా తరగతులు ఉపయోగపడతాయని గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను పేర్కొన్నారు శనివారం బలగ హడ్కో కాలనీలోగల శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా ముందుగా కథలు చెప్పడంతోపాటు ది హిందూ ఆంగ్ల దిన పత్రిక చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషతో పాటు ఇంగ్లీష్ కూడా నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సహాయకురాలు కె అనిత 25 విద్యార్థులు పాల్గొన్నారు.





స్థానిక 16వ డివిజన్ గొంటివీదిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణ మాదిగ, సచివాలయం ఉద్యోగులు, కోర్లకోట కొండలరావు పాల్గొని లబ్దిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం



వైకాపా రాష్ట్ర యువజన సంయుక్త కార్యదర్శిగా నియమితులైన చింతు రాఘవరావు మండలపార్టీ నాయకులతో స్థానిక పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్యను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

– సత్యంన్యూస్, నరసన్నపేట

## వెన్నుపోటు దినం'ను విజయవంతం చేయాలి

(సత్యంన్యూస్, టెక్కలి)



రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జూన్ 4న నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని టెక్కలి నియోజక వర్గంలోని వైకాపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలని టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలను మోసం చేసి, ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. ఆ బాధలను ప్రజల తరపున వెల్లడించేందుకు, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు జూన్ 4న అన్ని నియోజకవర్గంలో 'వెన్నుపోటు దినం' నిర్వహించాలని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు" అని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు పెద్దఎత్తున ర్యాలీలుగా వెళ్లి కలెక్టర్లకు, నియోజకవర్గ స్థాయి అధికారులకు జూన్ 4న మెమోరాండం ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలంతా ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు."ఇది ప్రజలతో ఉన్న మమకారాన్ని చాటే సమయమన్నారు. అన్ని వర్గాల సమస్యలకు అండగా నిలవాల్సిన సందర్భమని స్పష్టం చేశారు. అందువల్ల ప్రతి నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం జరిపి, ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. అంతేగాక, రెండు రోజుల్లో అన్ని మండల కేంద్రాల్లో పోస్టర్ రిలీజ్ కార్యక్రమాలు చేపట్టాలి" అని సూచించారు. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వానికి బలంగా తెలియజేయాలని పేరాడ తిలక్ పేర్కొన్నారు.

# దశల వారీ పోరాటాన్ని ఉద్యృతం చేయాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కార్గో ఎయిర్‌పోర్ట్‌కు వ్యతిరేకంగా దశలవారీ పోరాటాన్ని ఉధృతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహన్ రావు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయకార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు. మందస మండలం బిడిమి గ్రామంలో కార్గో ఎయిర్‌పోర్ట్‌కు వ్యతిరేకంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల భూములను బలవంతంగా తీసుకొని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడితే అభివృద్ధి ఎలా అవుతుందని మౌనం వీడి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఉద్దానం ప్రాంతంలో లక్షలాది చెట్లు కార్గో ఎయిర్‌పోర్ట్ పేరుతో తొలగిస్తే పలాసతో పాటు శ్రీకాకుళం జిల్లాకు తీరని ముప్పు ఏర్పడుతుందని దీనివలన పర్యావరణానికి తీవ్ర హాని కలగదా అని ప్రశ్నించారు. పలాస నుండి బయలుదేరే పాసింజరు ట్రైన్ రెండు విశాఖ ఎక్స్ప్రెస్ బరంపురం, భువనేశ్వర్‌కి తీసుకెళ్లినప్పుడు రవాణా కోసం ప్రజలు ఇబ్బంది పడుతుంటే మీరు ఏమి చేస్తున్నారు అని ప్రశ్నించారు. ఇదేనా మీరు చేసిన అభివృద్ధి అని వారు ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడితే సహించేది లేదని వారు హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలు ప్రయోజనం కోసం ఉన్నాయా లేదా ప్రజల ప్రయోజనాల కోసం ఉన్నాయా అని వారు ప్రశ్నించారు. బలవంత భూ సేకరణకు వ్యతిరేకంగా సముద్రతీరా ప్రాంతాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి వ్యతిరేకంగా ప్రజల మద్దతుతో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి చెందాలంటే వంశధార రిజర్వాయర్ పూర్తి చేసి చివరి భూముల వరకు రెండు పంటలకు నీరు ఇస్తే జిల్లా అభివృద్ధి చెందుతుందని వారన్నారు. ఆఫ్షోర్ రిజర్వాయర్ పూర్తి చేసి పలాస పట్టణానికి మంచి నీరు, మూడు మండలాలకు సాగునీరు అందజేయాలని డిమాండ్ చేశారు. జీడికి గిట్టుబాటు ధర కల్పించాలని జీడి బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పదంపాడుతూ కదం తొక్కారు. ఈ కార్యక్రమంలో కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు, కార్యదర్శి జోగి అప్పారావు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లానాయకులు జుట్టు వీరస్వామి, గోరకల బాలకృష్ణ సిఐటియు నాయకులు ఎన్ గణపతి, జీడి రైతు సంఘం కార్యదర్శి తెప్పల అజయ్‌కుమార్, ప్రజా సంఘాల నాయకులు మామిడి మాధవరావు, జోగి కోదండరావు, కోనేరు రమేషు, కొర్ల రామారావు చౌదరి, నల్ల హడ్డి, వెంకట్రావు నీలకంఠం, బిడిమి సర్పంచ్ పొట్టి ధర్మారావు, జోగి శ్రీదేవి, తెప్పలగున్నయ్య ఈరోతు. కృష్ణారావు, జుట్టు గున్నయ్య తేప్పల అప్పారావులు పాల్గొన్నారు




# మాస్‌కు కిక్కు!

కథ: తూర్పు గోదావరి జిల్లాలో దేవీపురం అనే ఊర్లో వారాహి అమ్మవారి గుడికి సుదీర్ఘ చరిత్ర ఉంటుంది. ఎన్నో ఏళ్లుగా ఆ గుడి ధర్మకర్తగా ఉన్న పెద్దావిడ మనవడు గజపతి వర్మ (మంచు మనోజ్). అతడి అనుచరుడైన శీను ఒక అనాథ. గజపతి అంటే శీనుకు ప్రాణం. తనకోసం ఏమైనా చేస్తాడు. గజపతి, వరద (నారా రోహిత్) ప్రాణ స్నేహితులు. ఈ ముగ్గురు కలిసి మెలిసి సాగుతూ ఊరికి ఏ కష్టం రాకుండా చూసుకుంటూ ఉంటారు. ఐతే దేవాదాయ మంత్రి (శరత్ లోహితశ్వ) కన్ను ఆ గుడికి సంబంధించిన వెయ్యి కోట్ల విలువైన భూమి మీద పడుతుంది. ఒక సమస్యలో చిక్కుకున్న గజపతికి సాయం చేసే క్రమంలో అతడి ద్వారానే గుడి భూమిని సొంతం చేసుకోవాలని ప్లాన్ చేస్తాడు మంత్రి. దీని వల్ల గజపతి – వరద మధ్య గొడవ మొదలవుతుంది. ఆ గొడవ ఎక్కడిదాకా వెళ్ళింది... ఇందులో శీను పాత్ర ఏంటి.. చివరికి ఈ ముగ్గురి జీవితాలు ఎలాంటి మలుపు తిరిగాయి అన్నది మిగతా కథ.

**'గరుడన్'లో సన్నివేశాలు సహజంగా సాగితే.. 'భైరవం'లో కొంచెం డ్రమటిగ్గా అనిపిస్తాయి. మన ప్రేక్షకుల అభిరుచి.. ముఖ్య పాత్రధారుల ఇమేజ్ ను దృష్టిలో ఉంచుకుని ప్రతిదీ భారీగా ఉండాలని చేసిన ప్రయత్నం వల్లే ఈ మార్పు కనిపిస్తుంది. తొలి గంటలో 'భైరవం' మామూలుగానే అనిపించినా.. ప్రి ఇంటర్వెల్ ఎపిసోడ్ నుంచి కథ మలుపు తిరుగుతుంది. మనోజ్ పాత్రలో కొత్త కోణం బయటికి రావడంతో కథ కూడా మలుపు తిరుగుతుంది. అక్కడి నుంచి దర్శకుడు రేసీ స్క్రీన్ ప్లేతో సినిమాను నడిపించాడు. ఇంటర్వెల్ ఎపిసోడ్ ఒక్కసారిగా ప్రేక్షకులను ఉలికిపాటుకు గురి చేస్తుంది. శ్రీనివాస్ పాత్రకు పూనకం వచ్చే సన్నివేశంతో మాస్ ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తుంది. ద్వితీయార్ధంలో కథ మరింత రక్తి కడుతుంది. మలుపులు ఆకట్టుకుంటాయి. చివరి అరగంటలో ఎమోషన్ బాగా పండింది. పతాక సన్నివేశాలను భారీగా తీర్చిదిద్దారు.**

**నటీనటులు:**

బెల్లంకొండ శ్రీనివాస్.. నారా రోహిత్..మంచు మనోజ్.. .. ఈ ముగ్గురికీ 'భైరవం'లో సమాన ప్రాధాన్యం ఉన్న పాత్రలే దక్కాయి. శ్రీనివాస్ క్యారెక్టర్, తన నటన మాస్ కు నచ్చేలా సాగాయి. తన బలమైన మాస్-యాక్షన్ సీన్లలో శ్రీనివాస్ ఇంపాక్ట్ చూపించాడు. ఇంటర్వెల్ ఎపిసోడ్లో పూనకంతో ఊగిపోయే సీన్లో.. అలాగే పతాక సన్నివేశాలో శ్రీనివాస్ బాగా చేశాడు. ఈ ఎపిసోడ్లలో పెర్ఫామెన్స్ స్టాండౌట్‌గా నిలిచింది. నారా రోహిత్ తన మార్కు సటిల్ యాక్టింగ్ తో ఆకట్టుకున్నాడు. మిడిలేజ్డ్ క్యారెక్టర్‌కు తగ్గ ఆహార్యంతో అతను కనిపించాడు. కెరీర్లో చాలా గ్యాప్ వచ్చినా రోహిత్ కాన్ఫిడెన్స్ ఏమి తగ్గలేదు. ఇలాంటి పెర్ఫామర్ ఎందుకు సినిమాలకు దూరంగా ఉన్నాడనిపిస్తుంది. నిజాయితీ పెద్దరికం ఉన్న పాత్రా తో రోహిత్ చాల పాజిటివ్ గా కనిపించారు . ఇక డిఫరెంట్ షేడ్స్ ఉన్న పాత్రలో మంచు మనోజ్ కూడా అదరగొట్టాడు. బేస్ వాయిస్ తో అతను చెప్పిన డైలాగ్స్ బాగానే పేలాయి. కొన్ని చోట్ల క్యారెక్టర్.. యాక్టింగ్ మరీ లౌడ్ అనిపించినా.. ఈ సినిమా పరిధిలో ఓకే. బెల్లంకొండకు జోడిగా నటించిన డైరెక్టర్ శంకర్ కూతురు అదితి తన పక్కనే కాక సినిమాలో ఏమాత్రం కుదరలేదు. తన స్క్రీన్ ప్రెజెన్స్, మేకప్ తేడా కొట్టాయి. తన ట్రాక్ కూడా మిస్ ఫైర్ అయింది. దివ్య పిళ్ళై.. ఆనంది తమ పాత్రల్లో బాగానే ఒదిగిపోయారు. జయసుధ.. సంపత్ రాజ్.. సహాయ పాత్రల్లో ఓకే అనిపించారు. విలన్ పాత్రల్లో శరత్ లోహితశ్వ.. అజయ్ బాగానే చేశారు.

**సాంకేతిక వర్గం:**

**'భైరవం'లో సాంకేతిక విభాగాల పనితీరు ఓకే. శ్రీ చరణ్ పాకాల పాటలు సాధారణంగానే అనిపించినా.. నేపథ్య సంగీతంతో అదరగొట్టాడు. యాక్షన్, ఎమోషనల్ ఎపిసోడ్లలో మంచి ఊపుతో సాగింది ఆర్ఆర్. హరి వేదాంతం ఛాయాగ్రహణం ఆకట్టుకుంటుంది. విజువల్ గా సినిమా బాగుంది. నిర్మాణ విలువలకు ఢోకా లేదు. బాగా ఖర్చు పెట్టారు. తెరపై భారీతనం కనిపిస్తుంది. ముఖ్యంగా ఇంటర్వెల్.. క్లైమాక్స్ ఎపిసోడ్లను భారీగా తీశారు. దర్శకుడు విజయ్ కనకమేడల.. తమిళంలో కథా ప్రాధాన్యంతో నడిచే 'గరుడన్'కు తెలుగులో మాస్-యాక్షన్ టచ్ ఇవ్వడానికి ప్రయత్నించాడు. ప్రస్తుత ట్రెండుకు తగ్గట్లు కొన్ని అంశాలను ఈ కథకు బాగానే అడాప్ట్ చేశాడు. యాక్షన్ ఎపిసోడ్లను బాగా తీసిన విజయ్.. కథనం మీద ఇంకొంచెం శ్రద్ధ పెట్టాల్సింది.**

**కథనం-విశ్లేషణ:**

ఓటీటీల పుణ్యమా అని అన్ని భాషల సినిమాలనూ అందరూ చూసేస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం రీమేక్స్ అన్నవి కత్తి మీద సాములా తయారయ్యాయి. ఒక సినిమా రీమేక్ అని తెలియగానే.. దాని విశేషాలన్నీ బయటికొచ్చేస్తున్నాయి. జనం ఒరిజినల్ చూసేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో చర్చలు పెట్టేస్తున్నారు. దీంతో కథ పరంగా ఎగ్జైట్మెంట్ ఉండట్లేదు. ఫలితాలు తేడా కొట్టేస్తున్నాయి. అయినా రీమేక్స్ ఏమీ ఆగిపోవట్లేదు. ఐతే మాతృకను ఉన్నదున్నట్లు తీయకుండా.. మార్పులు చేర్పులతో కొత్త లుక్ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు ఫిలిం మేకర్స్. 'గబ్బర్ సింగ్'తో హరీష్ శంకర్ మొదలుపెట్టిన ఈ ట్రెండుని వేరే దర్శకులూ అందిపుచ్చుకుంటున్నారు. 'నాంది'తో తెలుగు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన విజయ్ కనకమేడల కూడా 'గరుడన్' రీమేక్ 'భైరవం'తో అదే చేశాడు. మూల కథను అలాగే ఉంచి.. ట్రీట్మెంట్ అంతా మార్చేశాడు విజయ్. ఇమేజ్ ఉన్న హీరోలు తోడవడంతో వారికి తగ్గట్లు ఆయా పాత్రలకు హీరోయిజం జోడించడంతో పాటు యాక్షన్ ప్రధానంగా కథను నడిపించి దీన్నొక మాస్ మూవీలా మార్చాడు. మాతృకతో పోలిస్తే కథలో పట్టు కొంచెం తగ్గినట్లు అనిపించినా.. మాస్ ప్రేక్షకులకు నచ్చే అంశాలుండడంతో ఈ సినిమా ఆ వర్గం ప్రేక్షకులను బాగానే ఎంగేజ్ చేస్తుంది.

'గరుడన్'కు ఇచ్చిన మాస్ టచ్ బాగున్నా.. భారీతనం ఆకట్టుకున్నా.. మాతృకతో పోలిస్తే కథ పలుచనైపోవడం కొంత ప్రతికూలంగా మారింది. సినిమా అంతా అయ్యేసరికి యాక్షన్ ఘట్టాలు గుర్తుంటాయి.. కథ–పాత్రలు అంత బలమైన ముద్ర వేయవు. ఇందులో అసలు హీరోకు హీరోయిన్.. ఆమెతో లవ్ ట్రాక్ పెట్టాల్సిన అవసరమే కనిపించదు. కానీ బలవంతంగా ఒక ట్రాక్ ఇరికించడమే కాక.. శ్రీనివాస్ పక్కన అస్సలు సూట్ కాని అదితి శంకర్ ను పెట్టి.. సినిమాలో అస్సలు సింక్ కాని మాస్ పాటలకు ఇద్దరితో స్టెప్పులేయించారు. వెన్నెల కిషోర్ తో చేయించిన ప్రాస కామెడీ ఓకే అనిపిస్తుంది. వీటిని పక్కన పెడితే.. శ్రీనివాస్–నారా రోహిత్–మనోజ్ చేసిన మూడు ముఖ్య పాత్రలు.. వాటిలో ఆయా నటుల పెర్ఫామెన్స్ సినిమాను డ్రైవ్ చేశాయి.

ఇంటర్వెల్ ఎపిసోడ్లో ఉండే ఎమోషన్నే క్లైమాక్సులో కూడా వర్కవుట్ చేశాడు దర్శకుడు. కథనం కొంచెం ఎగుడు దిగుడుగా సాగినా.. 'భైరవం'.. మాస్ ప్రేక్షకులను బాగానే ఎంగేజ్ చేస్తుంది.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...

# హింసించి సాధించిన సాక్ష్యాలు, అరెస్టులు కోర్టుల్లో నిలబడతాయా?

(మొదటిపేజీ తరువాయి)

కొత్త ఎన్డీయే రచించిన భారతీయ చట్టాలను ఈ సందర్భంలో ఉటంకించడం లేదు, కూడదు. లేకపోతే అయోమయంలో పడిపోతాం) కనుక 161 వాంగ్మూలానికి విలువ ఉన్నప్పటికీ, పోలీసు కస్టడీలో ఇచ్చిన నేరాంగీకారాన్ని వాడుకుంటూ అరెస్టు చేసుకోవడం న్యాయమా?

పూర్తి ట్రయల్ తర్వాత శిక్ష పడడం వేరు. కానీ కోర్టు విచారణ ముగించకుందే జరిగే అరెస్టు, ముందస్తు అరెస్టు, పోలీసు కస్టడీ, జ్యుడీషియల్ కస్టడీ విషయాల్లో కూడా ఆరోపితులు హైకోర్టు, సుప్రీంకోర్టు దాకా వెళ్తారు. పోలీసుల ముందు నేరాన్ని ఒప్పుకుంటే అనుమానం ఉంటుంది. ఆ వాంగ్మూలానికి ఆమోద యోగ్యత ఉండదు. సెక్షన్ 24, 25, 30 కింద అనుమానితమైన ప్రకటన అని 153 సంవత్సరాల క్రితం సూత్రం ఇది. దీనిపై ఎన్నో వందల కేసులలో సుప్రీంకోర్టు తీర్పులు వచ్చాయి. నేరాంగీకారాన్ని అనుమానిస్తారు. పోలీసుల సమక్షంలో, లాకప్‌లో, లేదా మరెక్కడైనా సరే కొందరు పోలీసులు ఎదురుగా ఉన్నప్పుడు బలవంతంగా అంగీకరించేలా చేశారని అనుకుంటారు.

ఇది 'భారతీయ' సాక్ష్య చట్టం కాదు. ఆంగ్లేయులు రాసిపెట్టిన సాక్ష్యాల చట్టం. ఇండియన్ ఎవిడెన్స్ చట్టం. భారతీయ సాక్ష్యాల చట్టం 1872 పైన 2025లో అంటే 153 సంవత్సరాల క్రితం నుంచి అమలులో ఉన్న ఒక పాత చట్టం. ఒక తీర్పు కిందటి వారంలో సుప్రీంకోర్టు నుంచి వచ్చింది. సెక్షన్ 24 కింద నేర విచారణలో అసంబద్ధం అయినప్పుడు, ప్రేరేపణ, బెదిరింపు లేదా వాగ్దానం కారణంగా జరిగిన ఒప్పుకోలు చెల్లవు. నేరారోపణకు గురైన వ్యక్తి చేసిన అంగీకారాన్ని గనుక, కోర్టుకు ఏదైనా ప్రేరణ లేదా బెదిరింపు లేదా లాభం చేస్తామనే వాగ్దానం లేదా కీడు చేస్తామని బెదిరించినా జరిగినట్లు కనిపిస్తే, నేరారోపణకు గురైన వ్యక్తి చేసిన అంగీకారాన్ని ఒప్పుకోరని, అది అసంబద్ధమని సుప్రీంకోర్టు చెప్పింది.

**మే 2న హైకోర్టు తీర్పు, మే 16న సుప్రీంకోర్టు..**

ఆంధ్రప్రదేశ్ పోలీసులు కృష్ణమోహన్ రెడ్డి, రిటైర్డ్ ఐఎఎస్ ధనుంజయ్ రెడ్డి, వికాస్ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప ముందస్తు బెయిల్ గురించి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ తర్వాత మే 2న ముందస్తు బెయిల్ ఇవ్వడం జరిగింది. దీనిపై ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అప్పీలు చేసింది. అక్కడ 'దర్యాప్తు ఇంకా పూర్తికాలేదు. ప్రాథమిక దశలో ఉన్నప్పుడు మద్యం కేసులో రాజకీయ దురుద్దేశాలు ఉన్నట్టు ఆధారాలు దొరికినప్పుడు శతాబ్ద న్నర నాటి సూత్రం ఆధారంగా నేరాంగీకారం, పోలీసుల భయ ప్రయోగం కారణమైనపుడు అది నిలబడదు' అని మే 16న సుప్రీంకోర్టు వివరించింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మంగళగిరి పోలీసు స్టేషన్లో నమోదైన నేరంలో పిటిషనర్లకు ఎందుకు ఆంటిసిపేటర్ ముందస్తు బెయిల్ నిరాకరించిందనేది ముఖ్యమైన ప్రశ్న. రిజిస్టర్ చేసిన కేసులో ఆరోపణలు తీవ్రమైనవిగా ఐపిసి సెక్షన్ 409, 420, 12-బి, సెక్షన్ 34, 37లు పేర్కొన్నారు. అందులో దేశీయ న్యాయ సంహిత 2023లు ఏదో చెబుతూ, అవినీతి నిరోధక-1988 చట్టంలో కూడా కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నిరాకరణ తర్వాత సుప్రీంకోర్టుకు బెయిల్ జారీ చేసింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నిర్ణయాన్ని తప్పుబట్టి, సహ నిందితుడి పోలీసు భయం ఆధారంగా నేరాంగీకార ప్రకటన నిలబడదని, కనుక అరెస్టు చెల్లదని బెయిల్ మీద విడుదల ఇవ్వాలని సుప్రీం కోర్టు నిర్ణయించింది.

**సురేశ్ బుధర్మల్ కలానీ కేసులో..**

ఇది మరొక కేసును సుప్రీంకోర్టు అమరావతి రాజధాని హైకోర్టులో తాజా తీర్పులో 38వ పేజీలో ఉటంకించింది. ఇది చాలా కీలకమైంది. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ సెక్షన్ 30 ప్రకారం ఒక నిందితుడు ఇచ్చిన అంగీకార పత్రం (కన్‌ఫెస్సన్) అదే కేసులో అదే నేరానికి సంబంధించి కొందరు నిందితులు లేదా అనుమానితులు అందరు వారిని సంయుక్తంగా విచారణ ఎదుర్కొంటున్న మరో నిందితుడిపై కూడా వర్తిస్తుందని 1988లో సుప్రీంకోర్టు సురేశ్ బుధర్మల్ కలానీ కేసులో స్పష్టం చేసింది. అయితే, అటువంటి నేరాంగీకారాన్ని ఛార్జిలో ఆరోపణ పత్రం తయారు చేసినపుడు (ఫ్రేమింగ్ ఆఫ్ ఛార్జెస్) సమయంలో ఉపయోగించడం సాధ్యపడదు. మిగతా ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం ఆ అంగీకారం, (అంగీకార పత్రమే అయినా పోలీసుల సమక్షంలో లేదా వారి భయప్రలోభాలతో చేయించిన దాన్ని ఒప్పందం అని కూడా అంటారు) వాటి ఆధారంగా నేరారోపణలు మోపలేరు. అంతేగాక, ఒక నిందితుడిని వదిలేసిన (డిస్చార్జ్‌డ్) పరిస్థితిలో ఆ వ్యక్తి నేరాంగీకారాన్ని మిగతా నిందితులపై వర్తింపచేయడం కూడా చట్ట పరంగా వీలు కాదు. ఎందుకంటే సెక్షన్ 30లో పేర్కొన్న 'సంయుక్త విచారణ' అనే మౌలిక నిబంధన ఇక్కడ అమలులో ఉండదు. హైకోర్టు తీర్పులో సాక్ష్య చట్టం సెక్షన్-30 ప్రకారం ఆమోదయోగ్యమైన నేరాంగీకార ఒప్పందాన్ని ముందస్తు బెయిల్ లేదా రెగ్యులర్ బెయిల్ అంశాల్లో కూడా పరిగణించవచ్చని పేర్కొంది. సుప్రీంకోర్టు దీనిపై ఆశ్చర్యం ప్రకటించింది.

**దీపక్ కేసులో..**

ఒక నిందితుని నేరాంగీకార ఒప్పందాన్ని ఇతర నిందితులపై పరిగణించడానికి, ముందు ఆ ఒప్పందాన్ని చట్టరీత్యా సాక్ష్యంగా నిరూపించాలి. అంటే అది 1872 సాక్ష్యం చట్టం సెక్షన్ 24 ప్రకారం బలవంతంగా తీసుకోలేదని, సెక్షన్ 25 ప్రకారం పోలీస్ అధికారికి ఇచ్చినదీ కాదన్నదనీ విచారణలో ధృవీకరించాలి. ఈ తతంగం ట్రయల్ విచారణలో మాత్రమే పూర్తిగా పరిశీలించే అవకాశం ఉంటుందని దీపక్ కేసులో 2019లో స్పష్టం చేసింది.

పోలీస్ అధికారి ఎదుట ఇచ్చిన నేర అంగీకారం కనీసం పరిశీలనార్హం కూడా కాదు. అంతేకాకుండా, దాన్ని రుజువుచేయడం అసలే సాధ్యం కాదు. సెక్షన్ 30 కింద ఉన్న అంగీకార పత్రం చట్టపరంగా అమోదయోగ్యమైనదై ఉండాలి. ఇది ఆ కాలపరీక్షలో నిలబడిన సెక్షన్‌కు మూల సూత్రం.

సెక్షన్ 30 ప్రకారం, అటువంటి ఒప్పందాన్ని పరిగణించాలంటే నిందితులు 'ఉమ్మడి ట్రయల్ (సంయుక్త విచారణ')లో ఉండాలి. కేవలం ఒకే నేరానికి సంబంధించి నిందితులు ఉన్నారంటే సరిపోదు, వారంతా ఒకటే ట్రయల్ విచారణలో ఉండాలని 1894, 1938 నాటి తీర్పులలో ఉంది. 'సంయుక్త విచారణ' అనే పదాన్ని సీఆర్‌పీసీ సెక్షన్ 223 అర్థంలో చదవాలి. అంటే, నిందితులు ఒకేసారి అభియోగాలను ఎదుర్కొంటున్నట్లయితేనే తప్ప, సెక్షన్ 30 సూత్రం వర్తించదని 2005 తీర్పులో (బద్రి ప్రసాద్ ప్రజాపతి వర్సెస్ స్టేట్ ఆఫ్ ఎంపీ- 2025 సీఆర్‌ఎల్‌జే 1856), తాజా సుప్రీంకోర్టు తీర్పులో ప్రస్తావించింది.

ఏదైనా సందర్భంలో అటువంటి నేర అంగీకార ఒప్పందాన్ని బెయిల్ దశలో పరిగణించవచ్చని భావించినా, కశ్మీర సింగ్ కేసులో చెప్పినట్టు, అటువంటి ఒప్పందాన్ని 'ప్రామాణికతకు భరోసా కలిగించే న్యాయబద్ధ ఆచారంగా' మాత్రమే పరిగణించవచ్చు. అంటే, ఇతర ఆధారాలు ఉన్నపుడే అటువంటి ఒప్పందం దానిని బలపరచడానికి ఉపయోగించవచ్చు.

తర్వాత 40వ పేరాగ్రాఫ్‌లో, సాహిబ్ సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ హర్యాణా-1997, 7 ఎస్‌సీసీ 231 కేసులో పేర్కొన్నట్టు ఒక నేర అంగీకార ఒప్పందం సెక్షన్ 25 లేదా 26 ప్రకారంగా పరిశీలించేందుకు అవసరమైనదైతే, అటువంటి ఒప్పందాన్ని సెక్షన్ 30 ఆధారంగా మరొక నిందితుడిపై వర్తింప చేయడం చట్టవ్యతిరేకం. సెక్షన్ 25 ప్రకారం పోలీస్ ఎదుట నేరాన్ని ఒప్పుకోవడం పూర్తిగా నిషేధించబడింది. సెక్షన్ 26 ప్రకారం, పోలీసు కస్టడీలో ఉన్నపుడు ఇచ్చిన ఒప్పందం మేజిస్ట్రేట్ ఎదుట ఇవ్వలేకపోతే న్యాయపరంగా ఆ ఒప్పందం చెల్లదు.

**నందినీ సత్పతి కేసు..**

సీఆర్‌పీసీ సెక్షన్ 161 కింద ఒక నిందితుడు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను మరో నిందితుడిపై వర్తింప చేయవచ్చా అనే అంశాన్ని పరిశీలిస్తాం అంటూ సుప్రీం కోర్టు ఈ విధంగా వివరించింది. నందినీ సత్పతి వర్సెస్ పీఎల్ దాని 1978 ఎస్సీ 1025 ప్రకారం, ఒక నిందితుడిని పోలీసులు విచారించి, సెక్షన్ 161 కింద స్టేట్‌మెంట్ నమోదు చేయవచ్చు. అయితే అటువంటి స్టేట్‌మెంట్ చట్టపరంగా ఎంతవరకు ఆమోదయోగ్యమో మహాబీర్ మండల్ కేసులో సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. సీఆర్‌పీసీ సెక్షన్ 162 ప్రకారం, పోలీసు విచారణ సమయంలో ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను సాక్షిగా ఉపయోగించకూడదు. కేవలం సెక్షన్ 145 ప్రకారం వ్యతిరేకంగా విచారణ చేస్తూ లేదా ఉపయోగించి, అనుసరించి వివరించాలనిపించినప్పుడు మాత్రమే ఉపయోగించవచ్చు.

సెక్షన్ 161 కింద నిందితుడు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఒప్పందం లేదా అంగీకారం (అడ్మిషన్) అయి ఉండవచ్చు. ఇది చాలాసార్లు ఉటంకించిన కేసు పాకాల నారాయణ స్వామి కేసు ప్రకారం, ఒక ఒప్పందం అంటే నేరాన్ని ఒప్పుకునే స్టేట్‌మెంట్. కానీ, ఒక అంగీకారం అనేది కేవలం దుష్ప్రభావం కలిగించే ఒక అంశాన్ని మాత్రమే ఒప్పుకునే ప్రకటన. అటువంటి స్టేట్‌మెంట్ ఒప్పందంగా ఉంటే సెక్షన్ 25, 26 బలంగా వర్తిస్తాయి. అంగీకారంగా ఉంటే అది సెక్షన్ 161 కింద ఉన్నదే కావడం వలన సీఆర్‌పీసీ సెక్షన్ 162 వర్తిస్తుంది.

ఒక నిందితుడు ఇచ్చిన స్టేట్‌మెంట్ అపరాధాన్ని ఒప్పుకోవడం కాకుండా ఆ వ్యక్తిని నిర్దోషిగా చూపించేలా ఉన్నా, అది ఇతర నిందితుడిపై ప్రభావం చూపించకూడదు. ఎందుకంటే అటువంటి స్టేట్‌మెంట్‌ను న్యాయవాది అడ్డంగా ప్రశ్నల ద్వారా (క్రాస్ ఎగ్జామినేషన్) చేయలేరు. మినహాయింపుగా ఉండేది కేవలం సొంత నేరాన్ని ఒప్పుకున్నప్పుడు మాత్రమే, అది ఇతరులపై కూడా కొంతమేర వర్తిస్తుంది.

ఇటువంటి స్టేట్‌మెంట్లు దర్యాప్తు సమయంలో దిశ తెలుసుకునే ఉద్దేశంతో ఉపయోగపడవచ్చేమో గానీ, ఛార్జ్‌షీట్‌తో పాటు కోర్టులో సమర్పించడానికి వీల్లేదు. సెక్షన్ 30 ప్రకారం ఒప్పందాన్ని ఇతరులపై వర్తించాలంటే, దాన్ని న్యాయంగా రుజువు చేయాలి. ఆ విధంగా అటువంటి నేర అంగీకారాన్ని ఒప్పందానికి తోడుగా ఇతర ఆధారాలు కూడా ఉండాలి. కేవలం పోలీసు ఎదుట ఇచ్చిన ఒప్పందం ఆధారంగా ఇతరులను నిందించడం న్యాయబద్ధం కాదని తాజా తీర్పులో సుప్రీంకోర్టు వివరించింది.

## ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నియోజకవర్గ ప్రజల కోసం ఎమ్మెల్యే గొండు శంకర్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. నియోజకవర్గం నలుమూలల నుంచి వివిధ వర్గాల ప్రజలు నియోజకవర్గంలోని గార, శ్రీకాకుళం రూరల్ మండలం, శ్రీకాకుళం టౌన్ నుంచి పెద్ద ఎత్తున ప్రజలు విశాఖ ఎ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకొని వినతులను శనివారం అందజేశారు. ప్రతి ఒక్కరి సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కారం చూపిస్తామని శంకర్ అన్నారు. కూటమి పాలనలో అందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యంగా గత ఐదేళ్లలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించక పోవడంతో పెద్ద ఎత్తున నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు అందుతున్నాయన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం, విద్యుత్, డ్రైన్లు, సాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వినతులు అందుతున్నాయని వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా నిర్వహిస్తున్నామని గత 10నెలల్లోనే ప్రజాప్రభుత్వంగా ప్రజలతో మన్ననలు అందుకున్నామని వివరించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి, అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని శంకర్ వివరించారు. ఇళ్లు కావాలని పెద్దఎత్తున వినతులు అందుతున్నాయని రాష్ట్ర మంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఒక ప్రణాళిక రూపొం దిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



ఆమదాలవలస పురపాలక సంఘ పరిధిలో మెట్టక్కివలస 10,11 వార్డుల్లో శనివారం నిర్వహించిన పింఛన్ల పంపిణీలో మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డు పెద్దలు, మరియు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, ఆమదాలవలస

## రేపు ఉచిత వైద్య శిబిరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అఖిల భారత మానవతా సందేశ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో హోంలో జూన్ 1 (ఆదివారం) జెవమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ కన్వీనర్ ముజీబు రహమాన్ తెలిపారు. ఈమేరకు శనివారం ఎన్జీవో హోంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరంలో పలువురు వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి మందులు కూడా ఉచితంగా అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని స్థానికులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో ఎంఎ బేగ్,ఎంఎ బాషా, డాక్టర్ ఆదిమ్ హాసన్, షాను తదితరులు ఉన్నారు.

## విద్యాశాఖాధికారులపై చర్యలు తీసుకోండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



శ్రీకాకుళం జిల్లాలో యదేచ్ఛగా ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్స్ కాలేజీలలో విద్యా హక్కు చట్ట నిబంధనలకు విరుద్ధంగా పుస్తక విక్రయ మాఫియా –బుక్స్ స్కాం జరుగుతున్నప్పటికీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్న డీఈవో, ఆర్ఐఓలపై పాఠశాల ఉన్నత విద్యా శాఖ కమిషనర్ చర్యలు తీసుకోవాలని యునైటెడ్ నేషన్స్ ఎగైనెస్ట్ కరప్షన్ రాష్ట్ర అంబాసిడర్ నాయుడు గారి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంత జరుగుతున్నప్పటికీ మన జిల్లా యంత్రాంగం నిమ్మక నీరెత్తినట్టు వ్యవహరించడం ఎంతవరకు సమంజసమన్నారు. తక్షణమే పాఠశాల కళాశాలల గుర్తింపు రద్దు చేయడం గాని, భారీ మొత్తంలో ఫైన్ విధించడం కానీ చేయని పక్షంలో రాష్ట్ర హైకోర్టు దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉందన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

నియోజకవర్గం లో బూర్జ మండలం లోని ఉప్పినవలస గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారుడు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ పంపిణీ చేస్తున్నామన్నారు. అవ్వాతాతలు కుటుంబాల్లో ఆనందం చూడడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం గెలిసిన మరుక్షణం నుండే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.3వేలు ఉన్న పింఛన్‌ను రూ.4వేలు చేశారన్నారు. వికలాంగుల పింఛన్ రూ.6వేలకు పెంచారన్నారు. 100% వికలాంగులకి రూ.15వేలు ఇస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి అవ్వ తాతలకు ప్రతినెలా ఒకటో తారీకు లేదా ఒకరోజు ముందుగానే ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేస్తూ తామున్నామన్న భరోసా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## యోగా జీవితంలో భాగం కావాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతిఒక్కరి జీవితంలో యోగా ఒక భాగం కావాలని, యోగా ఆరోగ్యానికి ఎంతో ఉపకరిస్తుందని సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు అన్నారు. శనివారం శ్రీకాకుళం స్టేడియంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ రోజు మనం ఇంటి వద్దే యోగా చేసుకోవచ్చన్నారు. యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యాన్ని సాధించవచ్చని, అన్ని వయసులవారూ యోగా చేయొచ్చన్నారు. యోగా టీచర్లు పాండ్రంకి మురళి కృష్ణ, తంగి స్వాతి యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అధికారి నారాయణరావు, యువజన సర్వీసుల శాఖ అధికారి ఉజ్వల్, డీఎస్‌డీవో శ్రీధర్, సెట్‌శ్రీ సీఈవో కార్యాలయ మేనేజర్ రామారావు, కార్యాలయ సిబ్బంది, యోగా శిక్షకులు మురళీకృష్ణ, తంగి స్వాతి, ఆయుష్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో వక్తృత్వ పోటీలు



(సత్యంన్యూస్, లావేరు)

వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా లావేరు శాఖా గ్రంథాలయంలో శనివారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా ధూమపాన నిషేధం అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం ఆఖరి రోజున బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ హర్షవల్లి అధ్యక్షులుగా సత్యస్వరూప్

**- నిర్విరామ సేవలు కొనసాగిస్తాం**

**- లయన్ డా.సత్యస్వరూప్ మెడిసెట్టి**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

లయన్స్‌క్లబ్ హర్షవల్లి నూతన అధ్యక్షులుగా డాక్టర్ సత్యస్వరూప్ మెడిసెట్టి ఏకగ్రీవంగా ఎంపికయ్యారని లైన్స్‌క్లబ్ హర్షవల్లి శ్రీకాకుళం వ్యవస్థాపకులు, అడ్మినిస్ట్రేటర్ హారిక ప్రసాద్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళంలోని క్లబ్ కార్యాలయంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగిందని, కార్యదర్శిగా సత్యవరపు లక్ష్మణరావు, కోశాధికారిగా కె.పార్వతీశ్వరరావు, ఉపాధ్యక్షులుగా టిఎ.చంద్రశేఖర్, పి.మధుబాబు, క్లబ్ డైరెక్టర్ నాగమణి పంగపల్లి, సర్వీస్ ఛైర్పర్సన్ గౌతమ్ గుడ్ల, మార్కెటింగ్ చైర్‌పర్సన్ సుమన్ మజ్జి, ఎల్సిఐ.ఎఫ్ కోఆర్డినేటర్ ఎ.వెంకునాయుడు, మెంబర్షిప్ కమిటీ చైర్‌పర్సన్ నీహార్ చందక ఎన్నికయ్యారన్నారు. 2025 జూలై 1 నుంచి 2026 జూన్ 30 వరకు ఈ నూతన కార్యవర్గం పనిచేస్తుందని జోన్ చైర్మన్ కె.శోభారాణి, ఆర్సీ డాక్టర్ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా లయన్ డాక్టర్ సత్యస్వరూప్ మెడిసెట్టి మాట్లాడుతూ నిర్విరామ సేవలు కొనసాగిస్తామని, కష్టపడి కాకుండా, ఇష్టపడి పనిచేసి క్లబ్‌కు మరింత పేరు, ప్రఖ్యాతులు తీసుకువస్తానని, నిర్విరామంగా సేవా కార్యక్రమాలతోపాటు, యువతను చైతన్యపరిచే సందేశాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గానికి పూర్వపు అధ్యక్షులు వావిలాపల్లి జగన్నాధం, వారి బృందం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ హర్షవల్లి శ్రీకాకుళం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు, పూర్వపు అధ్యక్ష బృందం, ఇతర సీనియర్ లైన్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
















## వైకాపా యువజన విభాగం
# సంయుక్త కార్యదర్శిగా రామరాజు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వైకాపా యువజన విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నక్క రామరాజును నియమిస్తూ పార్టీ అధిష్టానం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. గతంలోనూ రామరాజు వైకాపా యువజన విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. దానిని అధిష్టానం రెన్యువల్ చేసింది. తనకు ఈ అవకాశం కల్పించిన పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ, పార్లమెంట్ ఇన్‌ఛార్జి ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతిలకు ధన్యవాదాలు తెలిపారు. అధిష్టానం అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానన్నారు.

# సనపల మాలతికి డాక్టరేట్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్ర విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగంలో శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో గొర్రెలు, ఆవులు, గేదెలు, మేకల్లో గ్యాస్ట్రో ఇంటెస్టైనల్ పరాన్నజీవి వ్యాధుల ప్రాబల్యం, వాటిలో ఉండే పరాన్నజీవుల నిర్మాణ, వర్గీకరణపై అధ్యయనం చేసిన జిల్లాకు చెందిన సనపల మాలతికి యూనివర్సిటీ డాక్టరేట్ ఇచ్చింది. ప్రొఫెసర్ యు.షమీమ్ గైడ్‌గా దీనికి వ్యవహరించారు. వీటికి ఎనిమిది రకాల గ్యాస్ట్రో ఇంటెస్టైనల్ పరాన్నజీవుల నిర్మాణం ఉందని, గొర్రెలు, మేకలపై జరిపిన పరిశోధనలో 15 రకాల గ్యాస్ట్రో ఇంటెస్టైనల్ పరాన్నజీవులు గుర్తించబడ్డాయని మాలతి గుర్తించారు. రాష్ట్రంలో విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లో భౌగోళిక పరిస్థితుల ఆధారంగా జంతుశాస్త్రంలో ఈ పరిశోధనలు జరపడం కొత్త అంశం. ఈ సందర్భంగా ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ ఆమెని అభినందించి డాక్టరేట్‌ను అందజేశారు. ఈమెకు డాక్టరేట్ లభించడంపై జంతుశాస్త్ర విభాగం అధ్యాపక వర్గం, కుటుంబ సభ్యులు అభినందించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు తన పరిశోధనకు అవకాశం కల్పించినందుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామ సర్వేయర్లకు గ్రహణం!

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ లేఖను అందించడంపై సర్వేయర్ల సంఘం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. రాష్ట్రంలోని 11వేల మంది గ్రామ సర్వేయర్ల భవిష్యత్తును కాలరాసే హక్కు రెవెన్యూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజుకు ఎవరిచ్చారని ఆ సంఘం ప్రశ్నించింది. ఇప్పటికే తహసీల్దార్ల ఆధీనంలో పని చేస్తున్న మండల సర్వేయర్లు 30 ఏళ్లు గడిచినా గ్రేడ్-1 వీఆర్వో స్థాయిని దాటలేకపోయారని సర్వేయర్ల సంఘం గుర్తు చేస్తోంది. వారిని సంప్రదించకుండా, అభిప్రాయాలు తెలుసుకోకుండా, సమ్మతి తీసుకోకుండా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు రెవెన్యూ శాఖలో గ్రామ సర్వేయర్లను కలిపేయమని ప్రభుత్వానికి బొప్పరాజు ఎలా లేఖ ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. గ్రామ సర్వేయర్లకు ప్రమోషన్ ఛానల్ వర్తించకపోయినా, పేస్కేల్‌లో మార్పు లేకపోయినా, రీసర్వేలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా ఏపీ అమరావతి జేఏసీ చైర్మన్‌గా బొప్పరాజు స్పందించలేదని, గ్రామ సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపని తహసీల్దార్ల పరిధిలోకి గ్రామ సర్వేయర్లను తీసుకురావాలని సూచించడం పట్ల ఆగ్రహం వ్యక్తమవుతోంది.

### సర్వే ఏడీ పరిధిలో చేర్చాలి

సచివాలయాల్లో సిబ్బంది రేషనలైజేషన్‌లో భాగంగా గ్రామ సర్వేయర్లను సర్వే ల్యాండ్ రికార్డ్సు ఏడీ పరిధిలోకి తీసుకురావాలని సంఘం ప్రతినిధులు కోరుతున్నారు. ప్రస్తుతం పంచాయతీరాజ్ శాఖకు చెందిన పంచాయతీ కార్యదర్శి వీరికి డీడీవోగా వ్యవహరిస్తున్నారు. ఇక మీదట పంచాయతీరాజ్ శాఖలో కొనసాగిస్తూ ఆన్‌డ్యూటీ, డిప్యూటేషన్ పేరుతో వేరే శాఖలో బాధ్యతలు అప్పగించవద్దని సర్వేయర్లు కోరుతున్నారు. ఇటువంటి విధానాల వల్ల ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలను కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విధులు నిర్వహించడానికి అవకాశం ఉన్న దేవదాయ, అటవీ శాఖల్లో తమను శాశ్వత ప్రాతిపదికన విలీనం చేసి గ్రేడ్-1 పేస్కేల్‌తో సంబంధిత శాఖలో ప్రమోషన్లు కల్పించేలా సర్వీస్ రూల్స్ మార్చాలని కోరుతున్నారు. అయితే రీసర్వే జరగని గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ సర్వే బృందాలుగా మిగులు గ్రామ సర్వేయర్లను డిప్యూటేషన్‌పై నియమించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది.

### భారీగా సిబ్బంది కుదింపు

రేషనలైజేషన్‌కు జారీ చేసిన జీవో-4 ప్రకారం సచివాలయాలను జనాభా ప్రాతిపదికన ఏ, బీ, సీ కేటగిరీలుగా ప్రభుత్వం విభజించింది. 3500కు మించి జనాభా ఉన్న సచివాలయాల్లో ఎనిమిది మంది చొప్పున ఉద్యోగులు, 2500-3500 లోపు జనాభా ఉన్న సచివాలయాల్లో ఏడుగురు, 2500 లోపు జనాభా ఉన్న సచివాలయాల్లో ఆరుగురు చొప్పున సిబ్బందిని కేటాయించాలని నిర్ణయించారు. ఆ మేరకు సచివాలయాలను కూడా కుదిస్తారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 585 సచివాలయాల సంఖ్య రేషనలైజేషన్ తర్వాత 300కు తగ్గిపోనుంది. శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో విలీన పంచాయతీలతో కలుపుకొని 48 సచివాలయాలు ఉండగా వాటిని సగానికి సగం తగ్గించి 24కు కుదిస్తున్నారు. దాని ప్రకారమే సిబ్బందిని సర్దుబాటుచేస్తారు. ఇంతకు ముందు వరకు ప్రతి సచివాలయంలో ఒక వీఆర్వో ఉండేవారు. కానీ ప్రస్తుతం నాలుగు వార్డులకు ఒక వీఆర్వోను కేటాయించారు. రేషనలైజేషన్ ద్వారా మిగిలిన సిబ్బందిని ఇతర శాఖల్లో సర్దుబాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. అయితే దీన్ని ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. శాశ్వత ప్రాతిపదికన గ్రామ, వార్డు ఉద్యోగుల అభిప్రాయం మేరకు కోరుకున్న శాఖల్లో విలీనం చేయాలని విన్నవిస్తున్నారు.

# ప్రతి పేదవాని కళ్లలో ఆనందం చూడాలి

- గత ప్రభుత్వంలో తప్పులు పురానవృతం కారాదు
- పండగ వాతావరణంలో సకాలంలో పింఛన్ల పంపిణీ
- శ్రీకాకుళం నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

పేదవాని కళ్లలో ఆనందం చూడాలనేదే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతీ పేదవానికి పింఛను సకాలంలో అందిస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఈ నెల ఒకరోజు ముందుగానే పింఛను అందించటం ఆనందంగా ఉందన్నారు. రూరల్ మండలం పొన్నాం గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ఇచ్చిన హామీ మేరకు వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, అన్ని వర్గాలవారికి ఆసరాగా పింఛన్ల పంపిణీ జాతరలా నిర్వహిస్తోందని, ప్రజా సంక్షేమమే తమకు ముఖ్యమన్నారు. ఆర్థిక స్వావలంబన అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఈ పింఛన్ల పథకం అందరికీ సంతోషం కలిగిస్తుందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను గుర్తించి, ఎవరికి అన్యాయం జరగకుండా అన్ని చర్యలు తీసుకొని సకాలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం పంచాయతీలో నవనంబాడు, గొల్లపేట గ్రామాలలో సీసీ రోడ్లు, కాలువల పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నేర నియంత్రణకు కార్డన్ సెర్చ్



(సత్యంన్యూస్, పలాస)

నేర నియంత్రణ, గంజాయి, మద్యం అక్రమ రవాణా, నిల్వలు గుర్తించేందుకు శనివారం ఉదయం కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు, మందస, కంచిలి పోలీస్ స్టేషన్ల పరిధిలో సీఐ, ఎస్సైల ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి వారి పరిధిలోని గ్రామాల్లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాలు వాహన పత్రాలు తనిఖీ చేసి సరైన రికార్డులు లేని, అనధికార వాహనాలు గుర్తించి, గంజాయి, మద్యం, నాటుసారా, మందుగుండు సామగ్రి అక్రమ నిల్వలపై సోదాలు చేశారు. కొత్త, అనుమానిత వ్యక్తులపై ఆరా తీసి నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేసేందుకు సహకరించాలని ప్రజలను కోరారు.

# పుణ్యపువీధిలో పింఛన్ల పంపిణీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇప్పిలివీధి సచివాలయం పరిధి పుణ్యపువీధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి చవిటిపల్లి గోవిందరావు, ఇప్పిలివీధి సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ శ్రీనివాస్ శనివారం పంపిణీ చేశారు. జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు వార్డు ఇన్‌ఛార్జి ఇన్‌ఛార్జి గోవిందరావు అన్నారు. కూటమి ఇచ్చిన హామీ మేరకు వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, అన్ని వర్గాలవారికి ఆసరాగా పింఛన్ల పంపిణీ జాతరలా నిర్వహిస్తోందన్నారు.



# వామనుడు టు త్రివిక్రముడు వి'స్వరూప్'ం



(మొదటిపేజీ తరువాయి)

పెట్టారంటే ఏ స్థాయిలో నమ్మకం కుదిరివుండాలి. తల్లి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్నప్పుడు యువకుడిగానో, అంతకు ముందు ప్రతిపక్షంగా ఉన్నప్పుడు చిన్నపిల్లాడిగా ఉన్న మెంటాడ వెంకట స్వరూప్ ఇప్పుడు రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడయ్యారు. ఆయనకన్నా ముందున్న ఇద్దరు ఎవరయ్యా అంటే.. ఒకరు మాజీమంత్రి జక్కంపూడి రామ్మోహన్ తనయుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా. జక్కంపూడి రామ్మోహన్ అంటే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయన తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైపోయినా ఆయన చనిపోయేవరకు ఆ పోర్ట్‌ఫోలియోను వేరే వారికి కేటాయించడానికి ఇష్టపడని రాజశేఖరరెడ్డి కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. 2014-19లో జక్కంపూడి రాజాను అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో పోలీసులు నడిరోడ్డు మీద కొడితే, తానున్నాంటూ జగన్మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చిన కుటుంబం. ఇక రెండో వ్యక్తి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి. సోషల్ మీడియాను, యూట్యూబ్ ఛానళ్లను రెగ్యులర్‌గా ఫాలో అవుతున్నవారికి బైరెడ్డికి, జగన్మోహన్‌రెడ్డికి ఉన్న అనుబంధం కోసం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అటువంటి వారి సరసన యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా నగరానికి చెందిన మెంటాడ స్వరూప్‌ను జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. వాస్తవానికి ఈ పదవిని మాజీమంత్రి దాడిశెట్టి రాజా సోదరుడికి ఇవ్వాలి. ఆ మేరకు వైకాపా సలహాదారులు జాబితా కూడా సిద్ధం చేశారు. కానీ జగన్మోహన్‌రెడ్డి టేబుల్ దగ్గరికెళ్లేసరికి స్వరూప్ పేరు వచ్చిచేరింది. ఇప్పటికే స్వరూప్ ఉత్తరాంధ్ర జిల్లాల యువజన విభాగంలో అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. ఇప్పుడు దీనికి అదనంగా రాష్ట్ర ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. 2014 నుంచి జగన్మోహన్‌రెడ్డితో స్వరూప్‌కు బంధం బలపడింది.

2014-19 మధ్య వైకాపా అధికారంలోకి రాకపోయినా జగన్మోహన్‌రెడ్డితో ఉన్న రిలేషన్ పెరగడానికి మాత్రం అది అడ్డుకాలేదు. 2019-24 మధ్య వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నా మెంటాడ కుటుంబానికి ఎటువంటి పదవులూ రాకపోయినా జగన్మోహన్‌రెడ్డి కార్యాలయానికి స్వరూప్ రాకపోకలు ఆగిపోలేదు. ఉత్తరాంధ్రలో ఏ పర్యటనకు జగన్మోహన్‌రెడ్డి వచ్చినా స్వరూప్‌కు సంబంధించిన మనుషులు ఎదురైనప్పుడు ఆయన కోసం ఆరా తీయడం కేవలం పత్రికల్లో పబ్లిసిటీ కోసం ఇచ్చుకున్న కథనాలు కావు. హెలీప్యాడ్ వద్దో, సభావేదిక వద్దో పార్టీ తరఫున ఉన్న కొందరు పెద్దలు చెప్పిన మాటలే ఇవి. జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజుకు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంత స్థాయిలో రక్తదాన శిబిరాలు నిర్వహించి జగన్మోహన్‌రెడ్డి స్వరూప్ అనే పేరును మర్చిపోలేకుండా ముద్ర వేసుకోగలిగారు. అప్పటి సీఎంవో నుంచి గాని, తాడేపల్లి ఇంటి నుంచి గాని స్వరూప్ రాకపోకలకు ఇబ్బంది లేకుండాపోయింది. 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా స్వరూప్ చేపట్టిన కార్యక్రమాలు జగన్మోహన్‌రెడ్డి దృష్టిని ఆకర్షించాయి. ఆ తర్వాత టౌన్‌హాల్‌లో జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు యువతతో నిర్వహించిన సమావేశాన్ని సూపర్‌హిట్ చేయడం వెనుక స్వరూప్ పాత్రను జగన్‌కు అప్పటి నాయకులే స్వయంగా వివరించారు. 2024 ఎన్నికల వరకు శ్రీకాకుళంలో ధర్మాన ప్రసాదరావు గెలుపు కోసం ఎత్తులు, పైఎత్తులు రచించడానికి తెర వెనుకే పరిమితమైపోయిన స్వరూప్ ఆ ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత జగన్మోహన్‌రెడ్డికి మరింత దగ్గరయ్యారు. 2014 ఎన్నికల్లో ధర్మాన ఓడిపోయిన తర్వాత 2019 ఎన్నికలకు ఓటర్ల జాబితా పట్టుకొని ఆయన చేసిన కసరత్తు చిన్నది కాదు. వైకాపా



అధికారంలోకి వచ్చిన తర్వాత ఐప్యాక్ టీమ్ అంటూ ల్యాప్‌టాప్‌లు, ఐప్యాడ్‌లు పట్టుకొని కొందరు హల్‌చల్ చేశారు కానీ, అసలు డేటా స్వరూప్ వద్దే ఉందనేది పార్టీలో కొందరికి మాత్రమే తెలిసిన సీక్రెట్. అక్కడ జగన్మోహన్‌రెడ్డికి, ఇక్కడ ధర్మాన ప్రసాదరావుకు మధ్య గ్యాప్ నడుస్తున్న రోజుల్లో కూడా ఈ రెండు పడవల మీద ఒకేసారి ప్రయాణం చేసిన ఘనత స్వరూప్‌దే. అలాగే పక్క జిల్లాలో బొత్స సత్యనారాయణ, ఇక్కడ ధర్మాన కృష్ణదాస్ మంత్రులుగా ఉన్నప్పుడు కామన్‌గా రాష్ట్రస్థాయిలో నాయకత్వ బాధ్యతల కోసం ఓ పేరు చెప్పాల్సివస్తే ఇద్దరూ స్వరూప్ పేరునే ప్రస్తావించిన సందర్భం ఉండటం చిన్నవయసులోనే పరిణతికి నిదర్శనం. జిల్లాలో ధర్మాన నాయకత్వాన్ని బలపరుస్తూనే కాపు సామాజికవర్గానికి దూరం కాకుండా సమకాలీన రాజకీయాలు నడపడం స్వరూప్‌కే చెల్లింది. వైకాపాలో రాష్ట్రవ్యాప్తంగా అనేకమందితో స్వరూప్‌కు సత్సంబంధాలున్నాయి. ఎంవీ పద్మావతి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా చేసినప్పుడు పద్మావతి తనయుడు స్వరూప్. పాలనలో తెర వెనుక జోక్యం చేసుకుంటున్నాడు ఆయనకు సన్‌స్ట్రోక్ తప్పదంటూ మందువేసవిలో అప్పట్లో కొన్ని పత్రికల్లో కథనాలు కూడా వచ్చాయి. కానీ ఇప్పుడు స్వరూప్ లేకుండా ఒక నియోజకవర్గ స్థాయిలో వైకాపా రాజకీయాలు లేకుండాపోయాయి. స్వయంగా నేతలే ఫలానా విషయంలో చొరవ చూపించాలని స్వరూప్‌ను కోరుతున్నారు. వైకాపా గత ఎన్నికలకు వెళ్లే ముందు ఐసీడీఎస్‌లో రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేశారు. కానీ శ్రీకాకుళంలో ఒక్కో కేంద్రాన్ని స్వరూప్, ఆయన తల్లి పద్మావతి సమ్మె నుంచి బయటకు తెచ్చి తెరిపించారు. ఎన్నికల్లో ఫలితాలేంటనేది పక్కన పెడితే రాష్ట్రవ్యాప్తంగా మంత్రులుగా ఉన్నవారి నియోజకవర్గాల్లో ఈమాత్రం పని ఎందుకు చేయలేకపోయారన్న ప్రశ్న అప్పట్లో తలెత్తింది. జిల్లాలో వైకాపా పరంగా రాజకీయంగా ఎన్ని గ్రూపులైనా ఉండొచ్చు. కానీ స్వరూప్ ఫలానా గ్రూప్‌కు నాయకుడు, లేదా సానుభూతిపరుడు అని చెప్పే సాహసం మాత్రం ఎవరూ చేయలేరు. ధర్మాన ప్రసాదరావు తర్వాత వైకాపా వారసత్వం రాజకీయంగా ఎవరికి వెళ్తుందనేది ఇప్పుడే తేలకపోయినా రేసులో మాత్రం స్వరూప్ ఉన్నాడన్న టాక్ టౌన్‌లో ఉంది. కాకపోతే కుల సమీకరణాలు, నియోజకవర్గాల



పునర్విభజన వంటి అంశాలపై ఇది ఆధారపడి ఉంటుంది. ధర్మాన ప్రసాదరావును డోల సీతారాములు నాయుడు చేయి పట్టుకొని తన రాజకీయ వారసుడంటూ తెర మీదకు తెచ్చినట్టు, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు అవకాశాలివ్వాలంటూ కోదండపాణి సంగీత దర్శకుల దగ్గరకు తిప్పినట్టు స్వరూప్‌కు కూడా ఓ అవకాశమొస్తే ధర్మానలాగే సుదీర్ఘ రాజకీయాలు చేయగలడని నమ్మేవారు నగరంలో ఎక్కువమంది ఉన్నారు. కథనం మొదట్లో ఇంతింతై వటుడింతయై అన్న పోతనే అదే పద్యంలో వామనుడు త్రివిక్రముడుగా క్రమక్రమంగా పైకి పోయే కొద్దీ సూర్యబింబం ముందు ఒక గొడుగులాగ తలపై కనిపించి క్రమంగా శిరోరత్నంగాను, చెవి కమ్మగాను, నగగాను, బంగారు జాజుబంతిలాగాను, కరకంకణం లాగాను, నడుముకు కట్టిన మొలతాటి బంగారు గంటగాను, పాదాల అందెగాను, ఆఖరుకు పాదపీఠంగాను కనిపించిందని పోతన భాగవతంలో చెబుతాడు. ఒక్క అవకాశమిస్తే ప్రతిపక్షమైనా పనిచేసి చూపించడానికి చాలని చెప్పడానికి స్వరూప్ నియామకమే సాక్ష్యం.

# ధూమపానం ప్రాణాంతకం

- పొగతాగే వారితో పాటు చుట్టుపక్కలవారు కూడా అనారోగ్యం బారిన పడుతున్నారు
- జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ అధ్యక్షులు ప్రవీణ్ సింగూరు
- పొగాకు వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ధూమపానం ప్రాణాంతకమని, ప్రపంచ వ్యాప్తంగా మరణాల రేటు పెరగడానికి ధూమపానం అతిపెద్ద కారణమని జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ అధ్యక్షులు ప్రవీణ్ సింగూరు అన్నారు. శనివారం శ్రీకాకుళం పాత బస్టాండ్, పొట్టి శ్రీరాములు కూడలి వద్ద ప్రపంచం పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ ఆధ్వర్యంలో పొగాకు వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. అధ్యక్షులు జేసీ ప్రవీణ్ కుమార్ సింగూరు మాట్లాడుతూ ధూమపానం నిండు జీవితాలను నాశనం చేయడమే కాక, కుటుంబానికి దూరం చేస్తుందని, పొగాకు వాడకానికి దూరంగా ఉండాలంటే చాలా మార్గాలున్నాయని వివరించారు. జోన్ కోఆర్డినేటర్ బగాది ప్రవీణ్ కుమార్, కార్యదర్శి సుదర్శన్ పట్నాయక్ మాట్లాడుతూ పొగతాగే వారితో పాటు చుట్టూ ఉన్నవారు కూడా అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారన్నారు. పొగాకు వాడకం వల్ల కలిగే చెడుపై ప్రపంచ వ్యాప్తంగా అవగహన కల్పిండమే ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవమన్నారు. అనంతరం దినసరి కూలీలు, మార్కెట్ వర్తకులు, యువతతో పొగాకు మానేద్దాం, ప్రజల ప్రాణాలు రక్షిద్దామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జేసీఐ శ్రీకాకుళం సన్‌రైజర్స్ సభ్యుల బృందం, సామాజిక, సంఘసేవకులు ఉర్లం శివతేజ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.